
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 311 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 21, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## యాదాద్రిలో నారసింహ జయంత్యుత్సవాలు

**యాదగిరిగుట్ట,(నమస్తే ఉదయం):** యాదాద్రి పుణ్యక్షేత్రంలో నారసింహుడు జయంత్యుత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా సోమవారం ఉదయం మొదలయ్యాయి. విశ్వక్‌సేన ఆరాధన, స్వస్తివాచనంతో మూడు రోజుల ఉత్సవాలకు ఆలయాధికారులు, పండితులు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆది పూజల్లో ఆలయ ఈవో భాస్కరరావు, వంశపారంపర్య ధర్మకర్త నరసింహ మూర్తి పాల్గొన్నారు.



## వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్

- యాసంగిలో 35 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరలకే సేకరణ
- స్కూళ్ల ఆధునీకరణకు 600 కోట్లు కేటాయింపు
- మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
- కాళేశ్వరంపై ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు చర్యలు
- జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాకు ఆహ్వానం
- కేబినేట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు

**హైదరాబాద్,మే 20(నమస్తే ఉదయం):** రైతులకు వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. యాసంగిలో రైతుల పండించిన ధాన్యం సుమారు 36 లక్షల మెట్రిక్ టన్నులు పౌరసరఫరాల శాఖ సేకరించింది. ఈ సేకరించిన ధాన్యానికి 3 రోజులలోపే గతంలో రైతులకు ఎన్నడూ లేనట్లుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఎప్పుడూ ధాన్యాన్ని ఇలా సేకరించలేదు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ధాన్యం వేగంగా సేకరించడంతో పాటు 3 రోజుల్లోపే నగదు జమ చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మూడు గంటలకు పైగా కొనసాగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని మిగతా.. 2లో

## ఆలయ భూములకు జియో ట్యాగ్!

### దేవాదాయశాఖపై నేడు మంత్రి సమీక్ష



**హైదరాబాద్,మే 20(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగానే ఆలయ భూముల్ని ఆధునిక పద్ధతిలో రికార్డు చేసేందుకు సిద్ధమైంది. సర్వే జరిపి వాటిని జియో ట్యాగ్‌తో పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. ఆలయ భూముల జియో ట్యాగింగ్, ఫెన్సింగ్, ధరణి రికార్డుల్లో భూముల వివ రాల నమోదు తదితర అంశాలపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించను న్నారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొంటారు. తెలంగాణలో ఆలయాలకు ఉన్న మొత్తం భూములు, వాటి జియో ట్యాగింగ్‌పై చర్చించనున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో... ఆయా జిల్లాల పరిధిలోని ఆలయాల భూములపై రికార్డులు దేవాదాయశాఖ ఆధీనంలోనే ఉన్నాయా ? ఆ భూములను ఎవరైనా ఆక్రమించుకున్నారా? ఒకవేళ ఆక్రమించుకుంటే తిరిగి రాబట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. వంటి అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. భక్తులు తమ ఇష్టదైవానికి ఆన్‌లైన్‌లో డొనేషన్లు సమర్పించేందుకు, ఎంపిక చేసిన ఆలయాల్లో సేవా టికెట్లు పొందేందుకు కామన్ పోర్టల్ ఏర్పాటుపై చర్చిస్తారు.



## ఏసీబీ వలలో కమలాపూర్ తహసీల్దార్

- రైతు దగ్గర లంచం తీసుకుంటూ చిక్కిన వైనం
- ఆమెపై గతంలోనూ పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు
- కార్యాలయంలో మరో మూడు అవినీతి చేపలు
- ప్రతి చిన్న పనికి పైసలు డిమాండ్

**హన్మకొండ, (నమస్తే ఉదయం):** జిల్లాలోని కమలాపూర్ తహసీల్దారు మాధవి రైతు దగ్గర లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డారు. కమలాపూర్ మండలం కన్నూరు గ్రామం కు చెందిన రైతు కసరబోయిన గోపాల్ దగ్గర విరాసత్ రిజిస్ట్రేషన్ కోసం ఆమె రూ.30 వేలు డిమాండ్ చేసింది. రైతు ముందుగా రూ.5 వేలు మిగతా.. 2లో

## ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

- అధ్యక్షుడితో పాటు విదేశాంగమంత్రి కూడా మృతి
- హెలికాప్టర్ ప్రమాదంలో మరణించినట్లు ధృవీకరణ
- అజర్‌బైజాన్ లో ప్రతికూల వాతావారణంతో కూలిన ఛాపర్
- ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బర్
- ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి..ఇరాన్ ప్రజలకు సానుభూతి

**టెహ్రాన్,మే20(నమస్తే ఉదయం):** హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందారు. ఈ విషయాన్ని స్థానిక మీడియా ధృవీకరించింది. అధ్యక్షుడితో పాటు ఆ దేశ విదేశాంగ మంత్రి కూడా ఈ ఘటనలో చనిపోయారు. ఓ



ఆనకట్ట ప్రారంభానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో.. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ అదుపు తప్పి, తూర్పు అజర్‌బైజాన్ సరిహద్దుల్లోని జోల్ఫా ప్రాంతంలో కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ మొత్తం కాలిపోవడంతో.. అందులో ఉన్న వ్యక్తులందరూ ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం అక్కడ ఇతర మిగతా.. 2లో

## ముగిసిన ఐదో విడత పోలింగ్

- అత్యధికంగా బెంగాల్లో 73శాతం పోలింగ్
- పలు ప్రాంతాల్లో ఓటేసిన ప్రముఖులు
- అమేథీలో స్మృతి, లక్‌నోలో రాజ్‌నాథ్, మాయావతిలో ఓటు
- ముంబైలో ఓటేసిన అక్షయ్ కుమార్, జాన్వీ

**న్యూఢిల్లీ,మే20(నమస్తే ఉదయం):** లోక్ సభ ఐదో విడత పోలింగ్ ముగిసింది. 6 రాష్ట్రాల్లో 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 49 లోక్ సభ స్థానాలకు పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు



5 విడతల్లో 430 లోక్ సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. మే 25న ఆరో విడత, జూన్ 1న ఏడో విడత పోలింగ్ జరగనుంది. జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ముంబైలో పలువురు ప్రముఖులు, సినీ సెలబ్రిటీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగతా.. 2లో



## నలుగురు ఇస్లామిక్ ఉగ్రవాదుల పట్టివేత


- అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్
- నలుగురు శ్రీలంక వాసులుగా గుర్తింపు

**అహ్మదాబాద్,మే 20(నమస్తే ఉదయం):** విమానాశ్రయంలో నలుగురు ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులను గుజరాత్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ నలుగురు ఉగ్రవాదులు శ్రీలంకకు చెందిన వారు కాగా.. వారు హింసను సృష్టించడానికి ముఖ్యమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకునే పనిలో ఉన్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదులను మహ్మద్ నుస్రత్, మహ్మద్ నఫ్రాన్, మహ్మద్ ఫారిస్, మహ్మద్ రస్దీన్‌లుగా గుర్తించారు. గుజరాత్ ఉగ్రవాద నిరోధక స్క్వాడ్ కీలక అరెస్టులు చేసింది. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా తో సంబంధాలున్నట్టు అనుమానిస్తున్న నలుగురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రంలో సోమవారంనాడు అరెస్టు చేసింది. వీరిని శ్రీలంక జాతీయులుగా గుర్తించారు. వీరి కార్యకలాపాలు, వ్యూహాలపై మరింత సమాచారాన్ని రాబట్టేందుకు అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఐఎస్ఎస్ఎస్ టెర్రరిస్టుల అరెస్టు నేపథ్యంలో విమనాశ్రయం చుట్టూ భద్రతను మరింత పెంచారు. కాగా, అరెస్టు అయిన నలుగురు ఐఎస్ ఉగ్రవాదులను ఇంటరాగేషన్ కోసం గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకువెళ్లినట్టు సమాచారం. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ఉగ్రవాదుల సంచారం వెనుక కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు. క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌ల కోసం మూడు ఐపీఎల్ టీమ్‌లు విమానాశ్రయానికి చేరుకోవడానికి ముందు ఐఎస్ ఉగ్రవాదులను గుజరాత్ ఏటీఎస్ ఈ అరెస్టులు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నలుగురు ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు తొలుత కొలంబో నుంచి చెన్నై చేరుకున్నారని, ఆ తర్వాత అక్కడి నుంచి అహ్మదాబాద్‌కు చేరుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. మూలాల ప్రకారం.. వారు అహ్మదాబాద్ విమానాశ్రయంలో తమ పాకిస్థానీ హ్యాండ్లర్ల నుండి సందేశం కోసం ఎదురు చూస్తున్న సమయంలో గుజరాత్ పోలీసుల యాంటీ మిగతా.. 2లో

## కవితకు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగింపు


- జూన్ 3 వరకు పొడిగించిన ప్రత్యేక కోర్టు

**న్యూఢిల్లీ,మే 20(నమస్తే ఉదయం):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 3 వరకు కోర్టు పొడిగించింది. సోమవారంతో కస్టడీ ముగిసింది. దీంతో ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఈ మేరకు మధ్యాహ్నం 2 గంటలకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించే విషయంపై రౌస్ అవెన్యూ కోర్టు విచారించింది. అయితే కవితను కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈడీ, సీబీఐ అధికారులు హాజరుపరిచారు. సీబీఐ కేసులో కవితకు జ్యుడీషియల్ రిమాండ్ జూన్3 వరకు కోర్టు పొడిగించింది. లిక్కర్ కేసులో కవితపై ఈడీ దాఖలు చేసిన తాజా ఛార్జ్ షీట్‌పై విచారణ కొనసాగుతోంది.




తాజా ఛార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై కోర్టు విచారణ జరుపుతుంది. తాజా ఛార్జ్ షీట్‌లో కొన్ని అంశాలపై సీబీఐ అధికారులను జడ్జి కావేరి బవేజా వివరణ అడిగారు. 15 నిమిషాలు కేసు మిగతా.. 2లో

## బెంగళూరు శివారులో రేవ్ పార్టీ



- మాదక ద్రవ్యాలు వినియోగించినట్లు గుర్తింపు
- పార్టీలో పాల్గొన్న ప్రముఖులు, టీవి,సినీ నటులు
- వందమందికి పైగా అరెస్ట్.. పలు ఖరీదైన కార్లు స్వాధీనం
- మంత్రి కాకాణి గోవర్ధన్ స్టిక్కర్ లభ్యం
- రేవ్ పార్టీలో పాల్గొనలేదని నటి హేమ వివరణ

**బెంగళూరు,మే20(నమస్తే ఉదయం):** బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడ్డారు. ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడి చేశారు. దాదాపు 100 మందికి పైగా పార్టీకి హాజరయ్యారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే పార్టీకి వచ్చిన ఓ కారులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ దొరికింది. పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫామ్ హౌస్ పరిసరాల్లో జాగ్వార్, బెంజ్ సహా ఖరీదైన 15 ఖరీదైన కార్లను జప్తు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసిన ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ రేవ్ పార్టీలో లిక్కర్ తో పాటుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ కూడా లభ్యం అయ్యాయి. జీఆర్ ఫామ్‌హౌస్ అనేది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యక్తికి చెందినది తేల్చారు. ఈ పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు బెంగుళూరు పోలీసులు గుర్తించారు. టీవీ నటులు సహా, మోడల్స్, పలువురు వ్యాపార, రాజకీయ వారసులు మిగతా.. 2లో



## దక్షిణాది మాదే

### దేశవ్యాప్తంగా ఎన్డీయేకు 400 సీట్లు
### పీటీఐకి ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

**భువనేశ్వర్, మే 20(నమస్తే ఉదయం):** దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని పార్టీల కన్నా బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాది భారీ విజయాలతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిపి 400 సీట్లు దాటుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. "మరోసారి మోదీ సర్కారు... నాలుగో తారీఖున 400 సీట్లు" నినాదంతో దేశవ్యాప్త ప్రచారం చేసినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి ఆయన పీటీఐ వారాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి బలం లేదన్న ప్రచారాన్ని ఈసారి ఎన్నికల్లో పటాపంచలు చేస్తామన్నారు. తమ మిత్రపక్షాలు కూడా దక్షిణాదిలో పెద్ద ఎత్తున సీట్లు గెలవబోతున్నాయని చెప్పారు. ఓట్లశాతం భారీగా పెరగనుందని ప్రకటించారు. దక్షిణాదిలో 131 సీట్లుంటే గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 29 సీట్లు గెలిచి, దక్షిణాదిలో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఒడిసా, బెంగాల్లో కూడా బీజేపీకి పెరుగుతున్న మద్దతు చూసి ఇతర పార్టీలకు, మీడియా సంస్థలకు రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రెడ్ కారిడార్‌గా పేరొందిన ప్రాంతం కాషాయ కారిడార్‌గా మారిపోనుందని ప్రకటించారు.

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి గత నాలుగు దశల ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో ఖాతా తెరవని పరిస్థితి నెలకొందని చెప్పారు. తాము ఏ రాష్ట్రానికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటామని అన్నారు. బీజేపీ అంటే ఉత్తరాది పార్టీయని, బనియా-బ్రాహ్మిణ్ పార్టీ అని పథకం ప్రకారం చేసిన దుష్ప్రచారాన్ని ఈ ఎన్నికలతో పటాపంచలు చేస్తామని మోదీ ప్రకటించారు. అందుకే పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని వ్యాఖ్యానించారు. టెంపో నిండా డబ్బు పంపితే అదానీ-అంబానీలకు వ్యతిరేకంగా మాట్లాడనని స్వయంగా మిగతా.. 2లో

# ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

మొదటిపేజీ తరువాయి..

సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం అజర్‌బైజాన్ సమీపంలో ఇరుదేశాలు సంయుక్తంగా నిర్మించిన ఓ ఆనకట్ట ప్రారంభోత్సవానికి ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ వెళ్లారు. ఆ కార్యక్రమం ముగించుకొని అధ్యక్షుడు హెలికాప్టర్‌లో తబ్రిజ్ నగరానికి తిరుగు పయనమయ్యారు. అయితే.. భారీ పొగమంచు మధ్య పర్వతప్రాంతాలను దాటుతున్న సమయంలో హెలికాప్టర్ అదుపు తప్పి, జోల్ఫా ప్రాంతంలో నేలను బలంగా తాకింది. దీంతో.. హెలికాప్టర్‌లో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైంది. హెలికాప్టర్ గల్లంతైన విషయం తెలియగానే.. అధికారులు అప్రమత్తమై దాని ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతికూల వాతావరణ నేపథ్యంలో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. మానవరహిత విమానాల ద్వారా ప్రమాద స్థలాన్ని గుర్తించి.. సోమవారం ఉదయం రెస్క్యూ బందాలు అక్కడికి చేరుకున్నాయి. ఇబ్రహీం రైసీ మృతితో ఇరాన్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ సుప్రీం అయతుల్లా ఖమేనీకి ఇబ్రహీం రైసీ అత్యంత సన్నిహితుడు. 2021 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. అయితే.. తన ప్రత్యర్థుల్ని పక్కకు తప్పించి, ఆయన తక్కువ ఓటింగ్‌తో ఈ ఎన్నికల్లో గెలుపొందడం.. అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. ఖమేనీకి వారసుడిగా గుర్తింపు పొందిన ఇబ్రహీం.. 1988లో ఖైదీలను సామూహికంగా ఉరితీసినందుకు ఆంక్షల్ని ఎదుర్కొంటున్నారు. తాను అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పటి నుంచి ఇరాన్‌లో ఇస్లామిక్ చట్టాలను కఠినతరం చేయాలని ఆదేశించారు. తన హయాంలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారుస్తానని పదేపదే చెప్పేవారు. హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మృతిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'ఇబ్రహీం రైసీ మృతి విచారకరం. రైసీ మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇరాన్– భారతదేశం మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం రైసీ చేసిన కృషిని మరవలేం. రైసీ కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలకు సంతాపం తెలియజేస్తున్నా. ఈ కష్ట సమయంలో ఇరాన్‌కు భారతదేశం అండగా నిలుస్తోంది అని' ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'ఇబ్రహీం రైసీ, విదేశాంగ మంత్రి హెచ్ అమీర్ మృతి తనను తీవ్రంగా కలచి వేసింది. ఆ ఇద్దరు నేతలతో పలు సమావేశాల్లో పాల్గొన్నా. ఈ జనవరిలో ఓ సమావేశంలో కలిశాం. ఇద్దరు నేతల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం. ఈ కఠిన సమయంలో ఇరాన్ ప్రజలకు అండగా నిలబడతాం అని' విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేశారు.

### ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బర్

ఇరాన్: ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బర్ నియమి తులయ్యా రు. సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ దీనికి ఆమోదముద్ర వేశారు. అధ్య క్షుడిగా ఉన్న ఇబ్రహీం రైసీ తాజాగా హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న మొఖ్బర్‌ను తాత్కాలిక దేశాధ్య క్షుడిగా నియమించారు. రైసీ సంతాప సందేశంలో అలీ ఖమేనీ ఈ విషయాన్ని వెల్లడిరచారు. అదేవిధంగా దేశంలో ఐదు రోజుల సంతాప దినాలు ప్రకటిం చారు.

### సంతాపదినం ప్రకటించిన భారత్

హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నెల 21న సంతాపదినం పాటించనున్నట్లు ప్రకటించింది. రైసీ గౌరవార్థం ఆ రోజున దేశవ్యాప్తంగా జాతీయ జెండాను అవనతం చేయడంతో పాటు అధికారిక వేడుకలకు దూరంగా ఉండాలని కేంద్రం ఆదేశించింది. 1989లో ఇరాన్ తొలి సుప్రీంలీడర్ అయతొల్లా రుహొల్లా ఖొమేనీ మరణించిన సమయంలో భారత్ 3 రోజులు సంతాప దినాలు పాటించింది.

# ఏసీబీ వలలో కమలాపూర్ తహసీల్దార్

మొదటిపేజీ తరువాయి..

ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. సదరు అధికారిపై గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. విచారణ చెపడితే అనేక ఆసక్తికర అంశాలు బయటపడే అవకాశం ఉంది. అయితే తహసీల్దారును ఏసీపీ పట్టుకోవడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో మరో మూడు అవినీతి చేపలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ప్రతి చిన్న పనికి పైసలు డిమాండ్ చేస్తూ పీడిస్తున్నారని అంటున్నారు.

# ముగిసిన ఐదో విడత పోలింగ్

మొదటిపేజీ తరువాయి..

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ముంబైలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశాడు. నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్, అమితాబచన్, జయాబచన్ క్యూ లైన్లో నిలబడి ముంబైలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ముఖేష్ అంబానీ,నీతా



అంబానీ కొడుకుతో కలిసి ముంబైలో ఓటు వేశారు. రతన్ టాటా, గాయకుడు ఉదిత్ నారాయణ్ ముంబైలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నటి మాధురీ దీక్షిత్ ముంబైలోని పోలింగ్ బూత్ లో లైన్లో నిలబడి ఓటు వేశారు. నటి సోనాక్షి సిన్హా తన తల్లి పూనమ్ సిన్హాతో కలిసి ఓటు వేశారు. సారా అలీఖాన్, అమృతా సింగ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.దేశవ్యాప్తంగా ఐదో దశ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ జరుగుతోంది. ఉదయం నుంచి ఓటర్లు బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. దాంతో సాయంత్రం 5 గంటల వరకు సగటున 56.68 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్‌లో రికార్డు స్థాయిలో 73 శాతం పోలింగ్ జరిగింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం డాటాను షేర్ చేసింది. పశ్చిమబెంగాల్‌లో 73 శాతం, లధక్‌లో 67.15 శాతం, జార్ఖండ్‌లో 61.90 శాతం, ఒడిశాలో 60.55 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 55.80 శాతం, జమ్ముకశ్మీర్‌లో 54.21 శాతం, బీహార్‌లో 52.35 శాతం, మహారాష్ట్రలో అత్యల్పంగా 48.66 శాతం పోలింగ్ నమోదైంది. ముంబైలో ఉదయం నుంచి కూడా పోలింగ్ నిరాశాజనకంగానే సాగుతున్నది.అక్కడ సాయంత్రం 5 గంటల వరకు కూడా పోలింగ్ 50 శాతానికి మించలేదు. ముంబై నార్త్‌లో 46.91 శాతం, ముంబై నార్త్ సెంట్రల్‌లో 47.32 శాతం, ముంబై నార్త్ ఈస్ట్ 48.67 శాతం, ముంబై నార్త్ వెస్ట్ 49.79 శాతం, ముంబై సౌత్‌లో అత్యల్పంగా 44.22 శాతం, ముంబై సౌత్ సెంట్రల్‌లో 48.26 శాతం పోలింగ్ నమోదైంది.

# కవితకు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగింపు

మొదటిపేజీ తరువాయి..

విచారణను కోర్టు వాయిదా వేసింది. కాగా.. మార్చి 26 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో కవిత ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాలపై సీబీఐ, ఈడీ నమోదు చేసిన రెండు కేసుల్లోనూ నేటితో రిమాండ్ ముగుస్తోండటంతో కవితను ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరిచారు. కవిత బెయిల్ కోసం ఆమె తరుపు న్యాయవాదులు చాలా ప్రయత్నించారు. ఇప్పటికే కోర్టు పలుమార్లు ఆమెకు బెయిల్ రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందే.

# బెంగళూరు శివారులో రేవ్ పార్టీ

మొదటిపేజీ తరువాయి..

కూడా రేవ్ పార్టీలో పాల్గొన్నట్లుగా చెబుతున్నారు. సీసీబీ సోదాల్లో ఎండీఎంఏ సహా పలు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. జాగ్వార్ లాంటి ఖరీదైన కార్లతో పాటు మొత్తం ఐదుగురిని సీసీబీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలుగు సినీనటి హేమ స్పష్టం చేశారు. ఈ విషయంపై ఆమె ప్రత్యేక వీడియో విడుదల చేశారు. 'నేను ఎక్కడకు వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే ఉన్నాను. ఇక్కడ ఫామ్‌హౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నాను. నాపై వస్తోన్న వార్తలను నమ్మకండి. అవి ఫేక్ న్యూస్. అక్కడ ఎవరు ఉన్నారో నాకు తెలియదు. దయచేసి మీడియాలో నాపై వచ్చే వార్తలను నమ్మకండి' అని విజ్ఞప్తి చేశారు.

# వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్

మొదటిపేజీ తరువాయి..

కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగించారు. రైతులకు నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు.అకాల వర్షాలతో ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ధాన్యం తడిచిపోయింది. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ధాన్యం తడిచిన రైతులు ఆందోళన చెందవద్దని, కనీస మద్దతు ధరకే కొంటామని భరోసా ఇచ్చారు. ఎలక్షన్ కోడ్ ఉండటంతో ఎన్నికల సంఘం అనుమతితో తెలంగాణ మంత్రివర్గం సోమవారం సమావేశమైంది.

రాష్ట్ర రైతులకు సీజన్ ప్రారంభం కాబోతోంది, పండించిన ధాన్యం సమస్య ఉంది, స్కూల్స్ ప్రారంభం కానున్నాయి, కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఓ నివేదిక ఇచ్చింది. దానిపై చర్చించేందుకు కేబినెట్ భేటీ అయినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్స్, రేషన్ బియ్యం, ఇతర పథకాలు 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఎన్నికల సమయంలో సన్న బియ్యం ఇస్తామని చెప్పినట్లు చేస్తామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్ ఇస్తామని ప్రకటించారు. విత్తనాలు, ఎరువులు, రైతులకు సంబంధించి ఇతరత్రా అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతాం. అధికారిక కంపెనీల ద్వారా విత్తనాలు కొనుగోలు చేయాలని, రిసీప్ట్ ను పంట వచ్చే వరకు భద్రపరుచుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

జూన్ 12న స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.600 కోట్లు వెచ్చించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్కూళ్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. స్కూళ్లను మోడ్రన్ పాఠశాలలుగా చేసి చూపించడం ఇందిరమ్మ పాలన అన్నారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి శ్రీధర్ బాబును అధ్యక్షుడిగా నియమించామని చెప్పారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ప్రకారం.. మేడిగడ్డ పగుళ్లు, అన్నారం లీకేజీ, మూడో డ్యామ్ ప్రమాదం ఉందని కనుక.. చుక్క నీరు ఆపొద్దని గేట్లు తెరవాలని రిపోర్టులో ఉందన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయించామని అన్నారు. ఎంఎస్‌పీ కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ చెల్లించకూడదని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యం అంతా రాష్ట్రంలోనే సేకరిస్తాం అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ ఏం చెప్తే అది చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. మంత్రివర్గంలో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. 'మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే.. సరి అవుతుందన్న గ్యారెంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ చెప్పింది. అందుకే, తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నాం' అన్నారు.బ్యారేజ్‌ల సేఫ్టీపై ఎక్స్‌పర్ట్ కంపెనీలతో పరిశీలన చేయించి రిపోర్ట్ తీసుకుంటామన్నారు. ఆ రిపోర్ట్ ఆధారంగానే మరమ్మతులు చేపడుతామన్నారు. తక్కువ ఖర్చుతో నీటిని లిఫ్ట్ చేసేందుకు అవకాశం ఉంటే పరిశీలించాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. జూన్ 2తో తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ సభకు సోనియా గాంధీతో పాటు తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన వారిని ఆహ్వానిస్తామన్నారు. వేడుకల నిర్వహణకు ఈసీకి లేఖ రాయాలని నిర్ణయించామన్నారు.




# 35 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన గ్రామపంచాయతీ సెక్రటరీ, కారోబార్

**శంషాబాద్, మే 20 (నమస్తే ఉదయం):** సోమవారం ఏసీబీ అధికారులు జరిపిన దాడిలో శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ గ్రామ కార్యదర్శి మాదిరెడ్డి రాధికా రెడ్డి. కారోబార్ బాల రాజు 35 వేల రూపాయల లంచం తీసుకుంటూ రెడ్




నానాజీపూర్ పంచాయతి కార్యాలయం

హ్యాండ్ గా పట్టుబడ్డారు. ఈ సంఘటన శంషాబాద్ మండలంలోని నానాజీ పూర్ గ్రామంలో చోటు చేసుకునే. పాతబస్తీలోని యాకత్ పుర ప్రాంతానికి చెందిన బర్కత్ అలీ నానాజీపూర్ గ్రామంలో 500 చదరపు గజాల ప్లాటును ఖరీదు చేశారు. ఆ ప్లాటుకు ప్రహరీ గోడతో పాటు ఓ గది నిర్మానానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శి రాధిక రెడ్డిని సంప్రదించగా 60 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చే వరకు నిర్మాణం చేపట్టకూడదని పనులను నిలిపివేశారు. దీనితో అతడు పంచాయతీ కారోబార్ ను సంప్రదించగా 50వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఎట్టకేలకు 35వేల రూపాయలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీనితో బర్కత్ అలీ ఏసీబీ అధికారులను సంప్రదించాడు.

సోమవారం ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కారోబార్ బాలరాజు డబ్బులు తీసు కుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండుగా పట్టుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఆధ్వర్యంలో దాడి చేసి ఇద్దరు నిందితులను రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు.

కేవలం మూడు నెలల వ్యాధిలో శంషాబాద్ మండలంలో ఇద్దరు గ్రామపంచాయతీ కార్యదర్శులు కారోబార్ లు అవినీతి అధికారులకు చిక్కడం సంచలనంగా మారింది.

మూడు నెలల క్రితం నర్కుడ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహ. పంచాయతీ కారోబార్ నాగరాజు పట్టుపడ్డారు. నానాజీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఇతర రికార్డులను కూడా అధికారులు పరిశీలించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న గద్వాల ఎస్పీ రీతిరాజ్





# విద్యార్థి దశ నుండి జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి : ఎస్ పి రితిరాజ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):** విద్యార్థి దశ నుండే జీవిత లక్ష్యాలను ఎన్నుకొని ప్రణాళిక తో చదువుతూ ముందుకు వెళ్లాలని జిల్లా ఎస్పీ రితిరాజ్, విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు.

ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయం లోని గ్రీవెన్స్ హల్ నందు పోలీస్ సిబ్బంది, అధికారుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం లో పాస్ అయిన సందర్భంగా వారిని జిల్లా ఎస్పి అభినందించి, జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే మనం మంచి అలవాట్లను ఎలా అలవరచుకోవాలి అనే అంశాలకు సంబందించి మిచ్ ఆల్బమ్ రచించిన టీఎల్ జేమ్స్ క్లియర్ రచించిన అటామిక్ హబిట్స్ అనే బుక్స్ ను అందజేశారు. అనంతరం విద్యార్థుల గోల్స్ ను అడిగి తెలుసుకొని భవిష్యత్‌లో మంచి లక్ష్యాలను సాధించేందుకు ఏలాంటి చదువులు అవసరం, ఏ విదంగా ముందుకు వెళ్ళాలో విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ రీతి రాజ్ మాట్లాడుతూ... ప్రతి మనిషి ఉన్నత లక్ష్యాలను చేరాలంటే అందుకు మంచి అలవాట్లకు జీవితంలో అలవరచుకోవాలి అని అందుకు అటామిక్ హబిట్స్ బుక్స్ ఎంతగానో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు. విద్యార్థులు ఆ బుక్స్ ను చదివీ మంచి అలవాట్లను అలవరచుకోవాలి అని అన్నారు, ఎవరూ కూడా చదువులో మార్కులు తక్కువ వచ్చాయని బాధ పడాల్సిన అవసరం లేదని, ఏ సబ్జెక్టు లో అయిన మార్కులు తక్కువ వచ్చిన అదే సబ్జెక్టు ను మళ్లీ మళ్లీ సాధన చెయ్యాలని తప్పకుండా అనుకున్న మార్కులు సాధిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరు ఇంగ్లీష్ లాంగ్వేజ్ పై పట్టు సాధించాలని, అది భవిష్యత్ చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు సూచించారు. అలాగే తల్లి తండ్రులు కూడా పిల్లలకు చదువు విషయంలో స్వేచ్ఛను ఇవ్వాలని తద్వార వారు లక్ష్య సాధనను చేరేందుకు సులభతరం అవుతుందని అన్నారు.

పోలీస్ అధికారులు, సిబ్బంది తమ పిల్లలను బాగా చదివించి వారికి మంచి భవిష్యత్తు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి , ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పూర్తి అయిన పోలీస్ కుటుంబాల పిల్లలు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.






## నలుగురు ఇస్లామిక్
# ఉగ్రవాదుల పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

టెర్రరిజం స్క్వాడ్ వారు పట్టుకున్నారు. ఈ క్రమంలో.. వారి నుంచి కొన్ని పాక్ తయారీ ఆయుధాలు కూడా లభించాయి. ఇదిలా ఉంటే.. అంతకుముందు ఏప్రిల్‌లో గుజరాత్ ఏటీఎస్ , నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గుజరాత్ తీరంలో 14 మంది పాకిస్తానీ పౌరులను అరెస్టు చేసింది. వారి వద్ద నుండి 602 కోట్ల రూపాయల విలువైన 86 కిలోల నిషిద్ధ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్, రాజస్థాన్‌లలో 'మియావ్ మియావ్'గా ప్రసిద్ధి చెందిన నిషేధిత డ్రగ్ మెఫెడ్రోన్‌ను తయారు చేస్తున్న మూడు ల్యాబ్‌లను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఈ క్రమంలో ఏడుగురిని అరెస్టు చేసింది.

## బాధితులకు చట్టప్రకారం
# న్యాయం అందించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20 (నమస్తే ఉదయం):** సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ మండలాల




బాధితురాలు నుండి సమస్యను వింటున్న ఎస్పి రితీ రాజ్

నుంచి వచ్చిన 13 మంది బాధితుల నుంచి ఎస్పీ పిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిర్యాదుల పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ఆదేశించారు, ఆయా ఫిర్యాదుల పై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోని, నివేదికను అందజేయాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ తగాదాలకు సంబందించి -02.

భూ వివాదాలు, గొడవలకు సంబందించి -06

భార్య భర్తల తగాదాలకు సంబందించి -02.


అక్రమ రిజిస్ట్రేషన్ కు సంబంధించి-01

ఇతర అంశాలకు సంబంధించి-02

పిర్యాదులు వచ్చాయని జిల్లా ఎస్పీ వెల్లడించారు.

## జగదీశ్వర్ గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన
# ఆల్విన్ కాలనీ డివిజన్ నాయకురాళ్లు...

**కూకట్‌పల్లి, మే 20 (నమస్తే ఉదయం):** పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అద్వర్యంలో డివిజన్ తరపునుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మహిళా నాయకురాళ్లు మర్యాదపూర్వకంగా ఆయ




నను కలిశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, నాగేష్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, డి.గోపాల్, ఎం.లిగంరావు, భీమ్ రావు, వై.శ్రీనివాస్, డి.సుధాకర్, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, అరుణ, సౌందర్య, స్వరూప, కృష్ణవేణి, అనురాధ, నిర్మలమ్మ, శ్యామల, రాజేశ్వరి, నాగలక్ష్మి, పర్వీన్, యస్మిన్, మహముదా, నికత్ ఫాతిమా, నూర్జహాన్, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాది మోదే..

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ అన్నారని మోదీ ప్రస్తావించారు.

మూడోసారి అధికారానికి రాగానే ఉమ్మడి పౌర స్మృతి, జమిలి ఎన్నికలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే 100 రోజుల్లో అమలు చేయాల్సిన అంశాలను ఇంతకుముందే సిద్ధం చేశామని, వాటిని 125 రోజుల్లో అమలు చేస్తామని ప్రధాని ప్రకటించారు. తాను మైనారిటీలకు వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడలేదని, బీజేపీ ఎప్పుడూ మైనారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మోదీ చెప్పారు.



## రూ.1.10లక్షల ఎల్ఓసి అందజేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):**
గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలోని బోయలగూడెం గ్రామానికి చెందిన బి.చిన్నాన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన రూ.1.10 లక్షల ఎల్ఓసి లెటర్ ను సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్ నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి లబ్దిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

## యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**యాదగిరిగుట్ట, మే 20(నమస్తే ఉదయం):**
తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు స్వాగతం పలికి




ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తదితరులు దర్శించుకున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో బార్‌బర్ షాప్ దగ్ధం




**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని ఓ బార్ బర్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.3లక్షలు విలువచేసే సరుకులు అగ్నికి ఆహుత్మైన ట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి తెలిపిన వివరాల మేరకు బుచ్చన్న అనే వ్యక్తి గద్వాల మున్సిపాలిటి కార్యాలయం సమీపంలో గల మున్సిపల్ వ్యాపార సముదాయంలో చందూ హేర్ స్టైల్ షాపును నిర్వహిస్తున్నాడు.

సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో దుకాణంలో ఉన్న సరుకులు కాలి బూడిదయ్యాయని బాధితుడు వాపోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు దుకాణం నిర్వాహకుడు బుచ్చన్న తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## తోటి స్నేహితునికి ఆర్థిక సాయం చేసిన 1995 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):**
తోటి స్నేహితునికి 1995 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు ఆర్థిక సహాయం చేశారు. బీచుపల్లి పదవ బెటాలియన్ 1995 బ్యాచ్ మిత్రులకు సహాయం అందించిన సందర్భంగా జోన్ 7 జోగులాంబ ఎల్. ఏస్. చౌహాన్ అభినందించారు. అన్నారు.

10వ బెటాలియన్ బీచుపల్లి 1995 బ్యాచ్ ఈ కంపెనీకి చెందిన శీనివాసులుకు, HC




హెడ్ కానిస్టేబుల్ 495 గత రెండు సంవత్సరాల క్రిందట పెరలసిస్ వచ్చి డ్యూటీ చేయలేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుచుండగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కి చెందిన బ్యాచ్ మిత్రులు అందరూ కలిసి 1,20,000/- రూపాయల చెక్ ని జోన్ 7 జోగులాంబ ఆఫీస్ మహబూబ్ నగర్ డి ఐ జి ఎల్.ఏస్. చౌహాన్, ఐపీఎస్ చేతులమీదుగా అందించారు, ఈ సందర్భంగా డి ఐ జి ఎల్ ఎస్ చౌహాన్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ఐనవారే పట్టించు కోవడం లేదు అలాంటిది తోటి మిత్రులు అందరూ కలిసి ఆదుకోవడం చాలా సంతోష కరమైన విషయం శ్రీనివాసులు గారి మిత్రులందరికీ నా అభినందనలు అని అన్నారు.
ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు గారి మితులు ఇంతియాజ్, రాంగోవర్ధన్, గోపాల్ మరియు నజీర్ పాల్గొన్నారు.





ఎన్టీఆర్ జయంతి సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

### ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ఎన్.టీ.ఆర్. జన్మదిన వేడకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):**
ప్రముఖ నటుడు నందమూరి తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జమ్మిచేడులోని జమ్ములమ్మ ఆలయంలో ఎన్ టిఆర్ పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షచారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 200 మంది చిన్నారి పేషంట్లకు, డెలివరీ పేషెంట్స్ పండ్లు, బ్రెడ్ వాటర్ బాటిల్స్ పంపిణి చేశారు. అనంతరం ఎన్టీఆర్ సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా అధ్యక్షులు చిరు ముదిరాజ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ అభిమానులు అంటే అభిమానంలో కేవలం బ్యానర్లు ఫ్లెక్సీలు, పబ్లిసిటీలు కాదు ప్రజాసేవకు పేద ప్రజలకు అండగా నిలిచే విధంగా ఎన్టీఆర్ అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సూపరిడెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, వైద్యులు డాక్టర్ శ్యామ్, ప్రదీప్ సాక్సోని, ఎన్ టి ఆర్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, వీరేష్,సుభాన్, కృష్ణారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ రమేష్ నవీన్, దయ, ఈశ్వర్, పరిష, తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలలో ఔట్సోర్సింగ్ విధానంలో పని చేయుటకు, వివిధ పోస్టులకు,

# నిబంధనల ప్రకారం ఎంపికైన అర్హులైన అభ్యర్థులు

**- జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):**
గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు వివిధ పోస్టులకు వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ (స్థానిక సంస్థలు) తెలిపారు.

సోమవారం గద్వాలలోని పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయా పోస్టులకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఆదేశాల మేరకు అధికారులు అభ్యర్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపిక చేసేందుకు మొత్తం 24 పోస్టులకు గాను 2,370 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 11 ఉండగా 672 మంది, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 9 కి గాను 1483 మంది, మూడు ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు 201 మంది, ఒక థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఇందులో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో లాటరీ తీయగా థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు ఉషారాణి ఎంపికైంది. ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు భవాని, సమ్రిన్ బేగం, ఎండి సమీర్ ఎంపికయ్యారు.



డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలకు సులోచన రాణి, పూజిత, జయలక్ష్మి, హారిక, లక్ష్మి, శేఖర్ రెడ్డి, సువర్ణ, యశోద, ప్రసాదరావు, శైలజ, భాస్కర్ ఎంపికయ్యారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అనిత, సుందర్ రాజు, కళావతి, మంజుల, సుమలత, అన్వర్ భాష, పుష్పలత, ఉమలత, రేపల్లె జనార్ధన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఎస్ సంతోష్

# వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ బి.ఎస్ సంతోష్**


**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(నమస్తే ఉదయం):**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య శాఖ అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమీక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్తగా ఏర్పాటైన ఉండవెల్లి, కేటి దొడ్డి, ఎర్రవల్లి మండలాలలో పి హెచ్ సి ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు భవనాలలో కొనసాగుతున్న సబ్ సెంటర్ల వివరాలు కూడా తెలియ పరిచినట్లయితే, కొత్త భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో చేపడుతున్న రాష్ట్ర, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన టీబి, లెప్రసీ, మలేరియా, ఎయిడ్స్, ఇమ్యునైజేషన్, మాత శిశు సంరక్షణ, సంక్రమిత, అసంక్ర మిత వ్యాధుల పట్ల చేపడుతున్న చర్యలపై వైద్య అధికారులతో సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు,స్కానింగ్ సెంటర్లు, తదితర రిజిస్ట్రేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారిని డాక్టర్ శశికళ, ఉప వైద్యాధికారి సిద్ధప్ప, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి దినపత్రిక సీనియర్ రిపోర్టర్ బుడిగెల బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**రాజేంద్రనగర్, మే20(నమస్తే ఉదయం):**
సాక్షి రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జ్, సీనియర్ రిపోర్టర్ బుడిగెల బాబురావు జన్మదినం సందర్భంగా సోమవారం ఆయనను పలు



బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కోరని మహేష్

వులు జర్నలిస్టులు, నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో బాబురావు ముందుండి పని చేస్తున్నారని ప్రశంసించారు. దేవుడు బాబు రావుకు మంచి ఆరోగ్యాన్ని, సుఖసంతోషాలను అనుగ్రహించాలని ప్రార్థించారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించిన బొంగు, శశాంత్ గౌడ్

**హైదరాబాద్, మే 20(నమస్తే ఉదయం):**
హైదరాబాద్ పాతబస్తీ గొల్లకిడికి ప్రాంతానికి చెందిన బొంగు శశాంత్ గౌడ్ హాంకాంగ్లో జరిగిన ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, ఏషియన్ యూనివర్శిటీ ఆన్ (2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ను సాధించారు, హాంకాంగ్లో జరిగిన ఏషియన్ ఎక్విప్ట్ పవర్ లిఫ్టిం ఏషియన్ యూనివర్శిటీ కప్ పోటీలలో పాతబస్తీ గొల్లకిడికి నివాసీ బొంగు, శశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

శశాంత్ గౌడ్ 120 ప్లస్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా పాతబస్తీ పురానాపూల్ నుంచి గొల్లకిడికి వరకు ర్యాలీ నిర్వహించారు.
పెద్ద ఎత్తున శశాంత్ గౌడ్కు స్వాగతం వలికారు. ఈ సందర్భంగా తెలం గాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ బి. బుచ్చిదాస్ గౌడ్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను



ఊరేగింపులో పాల్గొన్న పవర్ లిఫ్టింగ్ పోటిలలో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించిన బొంగు, శశాంత్ గౌడ్

అన్ని విధాల ప్రోత్సహించవసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, ఏషియన్ యూనివర్శిటీ కప్ (2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సిధించిన బొంగు శాంత్ గౌడ్ ప్రస్తుతం లా చదువుచున్నారు. పాతబస్తీ బహదూర్పుర అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శశాంత్ గౌడ్ కొనసాగుతున్నారు.

కాగా శశాం త్ గౌడ్ తండ్రి బొంగు వినోభా గౌడ్ కేరళలో 1987లో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ (400) పోటీలలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ కార్యక్రమ లో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్, హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు త్యాగరాజు, కార్యదర్శి దయానంద్. రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# చెడ్డీ గ్యాంగ్ తరహాలో చుడీదార్ గ్యాంగ్

## ఓ ఫ్లాట్‌లో చొరబడి దొంగతనం

**హైదరాబాద్,మే 20(నమస్తే ఉదయం):**
హైదరాబాద్ లో చడ్డీ గ్యాంగ్ సృష్టించిన కలకలం గురించి మరువక ముందే నగరంలో మరో గ్యాంగ్ పుట్టుకొచ్చింది. చడ్డీ గ్యాంగ్ తరహాలోనే చుడిదార్ గ్యాంగ్ తయారయ్యింది. శనివారం రాత్రి ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జెక్ కాలనీలోని ఓ ప్లాట్ లో చొరబడి 4తులాల




బంగారం, లక్ష రూపాయల నగదు, ఒక ల్యాప్‌టాప్ దోచుకున్నారు చడ్డీ గ్యాంగ్. వివరాల్లోకి వెళితే జెక్ కాలనిలో నివాసం ఉండే కే వెంకట్రావు అనే ప్రైవేట్ ఉద్యోగి కుటుంబంతో కలిసి ఒంగోలు వెళ్ళాడు. శనివారం వెంకట్రావు పనిమనిషి వచ్చి చూడగా ఇంటి తాళం పగలకొట్టి ఉండటం గమనించింది. ఈ ఘటన తెలుసుకున్న వెంకట్రావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసాడు. వెంకట్రావు ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా చుడిదార్ గ్యాంగ్ పనిగా గుర్తించారు. ప్రస్తుతం చుడిదార్ గ్యాంగ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఇండియా కూటమి విచ్ఛిన్నానికి కౌంట్‌డౌన్

## బెంగాల్ ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**కోల్‌కతా,మే 20(నమస్తే ఉదయం):** ఇండియా కూటమి విచ్ఛిన్నానికి కౌంట్‌డౌన్ మొదలైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీపేర్కొన్నారు. అయిదో విడత పోలింగ్ అనంతరం ఆ కూటమి ఓటమి ఖాయమైందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లోని ఝూడ్‌గ్రామ్‌లో నిర్వహించిన ప్రచార సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, టీఎంసీలు మునుగుతోన్న



పడవలని ఎద్దేవా చేశారు. ప్రపంచ దేశాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న సమయంలో.. కుంభకోణాల రికార్డులు సృష్టించడంలో కాంగ్రెస్ నిమగ్నమైందని విమర్శించారు. హస్తం పార్టీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించిన మోదీ.. ఓటుబ్యాంకు వర్గాల కోసం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను లాక్కోవాలని చూస్తోందన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాల అనంతరం ప్రతిపక్ష కూటమి తన ఉనికి కోల్పోతుందని చెప్పారు. జల్‌పాయిగుడీలోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంపై జరిగిన దాడిని ఖండిస్తూ.. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. సీఎం మమతా బెనర్జీ స్వయంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం మోదీ తమ్లుక్‌లో ప్రచార సభకు వెళ్లాల్సింది. కానీ, ప్రతికూల వాతావరణంతో హెలికాప్టర్ ల్యాండింగ్‌లో సమస్య కారణంగా ఝూడ్‌గ్రామ్ నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు.

# కెసిఆర్‌కు పట్టిన గతే జగన్‌కూ తప్పదు

## జగన్ అహంకారంతోనే ఓడిపోతున్నారు

## మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మే 20 (నమస్తే ఉదయం):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్ ఇచ్చిన ఉచితాలకు.. ఆయన ఇంట్లో కూర్చుని గెలివాలని కాని ఆ పరిస్థితి లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఓడించినట్లే.. జగన్ అహంకారమే ఆయనను ఓడిస్తోందని విమర్శించారు.జగన్.. అభివృద్ధిపై దృష్టి పెడితే మరోలా




ఉండేదన్నారు. ఏపీ, తెలంగాణలో రోడ్లు దారుణంగా ఉన్నాయని అన్నారు. సోమవారం మీడియాతో కిషన్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీని బీజేపీ ఖచ్చితంగా గెలుస్తోందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై గతంలో ÷టైర్ అనే అభిప్రాయం ఉండేదని.. ప్రస్తుతం అతనిపై బ్లాక్ మెయిలర్ అనే ముద్ర పడిందని విమర్శించారు. కాంగ్రెస్ క్యాడర్, లీడర్ ఆయనకు సహకరించటం లేదని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని... బీఆర్ఎస్ ప్రభావం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీ ఎన్నిక రావటం బీజేపీకి కలసి వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# శాంతిభద్రతలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## పల్నాడు ఎస్పీ మల్లికా గార్గ్ హెచ్చరిక

**పల్నాడు,మే 20(నమస్తే ఉదయం):**
పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా మల్లిక గార్గ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడమే తన ముందున్న మొదటి లక్ష్యమని తెలిపారు. లా ఆర్డర్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో ప్రశాంతమైన రాష్ట్రంగా పేరు ఉండేదని ఆమె ప్రస్తావించారు. ప్రస్తుతం జరిగిన హింసాత్మక ఘటనల కారణంగా పల్నాడు జిల్లాలో అశాంతి నెలకొందని, తిరిగి ప్రశాంతత పరిస్థితులను నెలకొల్పేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.రాజకీయ నాయకులు లా అండ్ ఆర్డర్‌ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మల్లిక గార్గ్ హెచ్చరించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో తప్పుడు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కాగా ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో, అనంతరం కూడా చోటుచేసుకున్న హింసకు బాధ్యులుగా ఉన్న ఎస్పీని ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో మల్లిక గార్గ్‌ని ఈసీ నియమించింది.



# జూన్ 8న చేపప్రసాదం పంపిణీ

## వెల్లడించిన బత్తిని కుటుంబ సభ్యులు

**హైదరాబాద్,మే20(నమస్తే ఉదయం):**
మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది.. బత్తిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం అందిస్తున్నారు. ఈ ఏడాదికూడా చేప ప్రసాదం పంపిణీకి బత్తిని ఫ్యామిలీ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది మృగశిర కార్తె జూన్ 8న శనివారం ఉదయం పదకొండు గంటలకు ప్రవేశిస్తుంది.

జూన్ 8 ఉదయం పదకొండు గంటల నుంచి జూన్ 9వ తేదీ ఉదయం పదకొండు గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు. చేప ప్రసాదం పూర్తిగా ఉచితంగా భక్తులకు అందిస్తామని అన్నారు. వివిధ ఫౌండేషన్ల సహకారంతో.. మెడికల్ సర్వీస్, భోజన సౌకర్యం, మంచి నీటి సరఫరా 24 గంటల పాటు ఉచితంగా భక్తులకు ఇస్తామని చెప్పారు.ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు చేప మందు ప్రసాదాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు.

చేప ప్రసాదం పంపిణీకి గత ప్రభుత్వాలు అన్ని ఏర్పాట్లు చేసిన విధంగానే.. ఈ ప్రభుత్వాన్నిసైతం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.





# బడి పంతుళ్లపై లాఠీలు.. బడుగు జీవులకు జూటా హామీలు..

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**నల్లగొండ,మే 20(నమస్తే ఉదయం):**
బడి పంతుళ్లపై లాఠీలు.. బడుగు జీవులకు జూటా హామీలు.. ఇదీ రేవంత్ పాలన అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దేవరకొండలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వంద రోజుల హామీ అమలు కాలేదు.. విద్యార్థి భరోసా కార్డు రాలేదు.. స్కూటీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు.. నిరుద్యోగ భృతి అమలు పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతులెత్తేశారు అని హరీశ్‌రావు తెలిపారు. ఎన్నికల ముందు ప్రియాంక, రాహుల్, రేవంత్ ఇచ్చిన ఏ హామీ కూడా అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు మూడు డీఏలు అన్నారు.. ఒక్క డీఏ కూడా రిలీజ్ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్ ఇవ్వలేదు. మెరుగైన పీఆర్‌సీని ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. విద్యావంతులు, నిరుద్యోగుల్లారా.. ఆలోచన చేసి ఓటు వేయాలి.. మీ ఓటుతో గుణపాఠం చెప్పండి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డిని గెలించాలి అని హరీశ్‌రావు కోరారు.కాంగ్రెస్‌కు




ఓటేయడమంటే కాంగ్రెస్ మోసాన్ని బలపరిచినట్లవుతుంది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయి. యాజమాన్యాలు, విద్యావంతులు ఆలోచన చేసి ఓటు వేయాలి. జర్నలిస్టులకు వంద కోట్లు ఇస్తామని, వంద పైసలు కూడా ఇవ్వలేదు. వంద పైసలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వ మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు మాత్రం గడప దాటడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటే? రాకేష్ రెడ్డిని గెలిపించాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ తండ్రి కానిలాల్ నాయక్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం దేవరకొండకు హరీశ్‌రావుకు చేరుకుని రవీంద్ర కుమార్ తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

# మిర్చి రైతులకు స్టోరేజీలను ఇవ్వాలి

## ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచడం తగదు

**గుంటూరు,మే20(నమస్తే ఉదయం):**
మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుందని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం నాయకులు విమర్శించారు. అక్రమంగా వసూళ్లు చేస్తున్నా అధికారులు, పాలకవర్గం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక కమీషన్, మచ్చుల పేరుతో మిర్చి యార్డులో అధిక వసూళ్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటినుంచే చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న, చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్‌కు వేయి కోట్లు కేటాయించి కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు, దళారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతుల పుట్టి ముంచేశారన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఒక్క నెల్లూరులోనే రూ.3 వేల కోట్లు దోచుకున్నారని సోమిరెడ్డి అన్నారు. ఈ స్కామ్‌పై సీఐడీ కాదు సీబీఐ లేదా జ్యుడిషియల్ ఎంక్వయిరీ జరిపితేనే నిజాలు నిగ్గు తేలుతాయని సోమిరెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మిల్లర్లు మాయచేసి రైతులను నిలువునా ముంచుతున్నారని కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పట్టపు నాని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల యజమానులు బయటి జిల్లాల నుంచి లారీలకొద్దీ ధాన్యాన్ని తెచ్చి నకిలీ రైతుల పేర్లతో బియ్యం చూపుతున్నారని, బిల్లులు చేసుకుంటున్నారన్నారు. ఒక మిల్లుకు రెండు కోట్ల రూపాయల మేర బ్యాంకు గ్యారెంటీ ఉంటే స్థానిక రైతులకు కోటి రూపాయల బిల్లులు చేసి, మిగిలినవి తమకు నచ్చిన రైతుల పేర్లతో చేసుకుంటున్నారని, ఈ అంశంపై రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మిల్లర్లు చేస్తున్న మోసం కారణంగా మూడు నెలలకు కూడా రైతులకు బిల్లులు అందట్లేదని, పెట్టుబడికి అధిక వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఈ తరహా మోసాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటుచేసి విచారణ చేయించాలని కోరారు.



# దేశంలో ఎక్కడ చూసినా

# మోడీ వేవ్

## ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కొండ

**న్యూఢిల్లీ,మే 20(నమస్తే ఉదయం):**
ప్రస్తుతం తెలంగాణలో ఎంపీ ఎన్నికలు ముగిసినందున బీజేపీ, కాంగ్రెస్ నేతలంతా ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ పార్టీ అధినేతల తరుపున పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొంటున్నారు.

ప్రస్తుతం బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తర భారత దేశంలోనే కాదు దక్షిణ భారత దేశంలోనూ ప్రధాని మోదీ వేవ్ కనిపిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇప్పుడు మోదీ వేవ్ కనిపిస్తోందని.. మోదీ కోసం ఓటు వేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బీజేపీపై దుష్ప్రచారం చేసిందన్నారు. లిక్కర్ స్కాం, కవిత అరెస్ట్‌లపై కాంగ్రెస్ తెలంగాణలో ఒకలా మాట్లాడిందని కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఢిల్లీలో మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్ సపోర్ట్ చేస్తోందని తెలిపారు. లిక్కర్ స్కాం విషయంలో కాంగ్రెస్ తెలంగాణలో ఒకలా... ఢిల్లీలో ఒకలా మాట్లాడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే కన్ఫ్యూజ్ పార్టీ అని కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

# బాధితుల గొంతు వినిపిస్తే కేసులా

## కంచర్లపాలెం పోలీసుల తీరు దారుణం

## మాజీమంత్రి దేవినేని ఉమ విమర్శలు

**అమరావతి,మే 20(నమస్తే ఉదయం):**
బాధితుల గొంతు వినిపించిన మీడియా స్వేచ్ఛపై కంచర్లపాలెం పోలీసులు దాడి చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. స్వామి భక్తి కోసం అక్రమ కేసులు పెడుతున్న కంచర్లపాలెం పోలీసుల తీరును దేశం మొత్తం చూస్తోందన్నారు. తప్పుడు




కేసులు పెట్టిన కంచర్లపాలెం పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తాడేపల్లి ఆదేశాల మేరకు సీఎస్ నేతృత్వంలోనే ఈ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మహిళలపై జరిగిన దాడిని లైవ్‌లో చూపించారని, సీఎం, సజ్జల డైరెక్షన్‌లోనే మీడియాపై అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాపై అక్రమ కేసులు బనాయిస్తున్న సీఎస్ వ్యవహార శైలిని ఈసీ కట్టడి చేయాలని కోరారు. మీడియాపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలింగ్ తదనంతర హింసపై సిట్ దర్యాప్తు కూడా పారదర్శకంగా జరగాలన్నారు. పోలింగ్ తదనంతరం జరిగిన హింసపై కాల్ డేటా బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వైసీపీ నేతలు తమ కాల్ డేటా బహిర్గతం చేయగలరా? అని సవాల్ విసిరారు. రాజేంద్రనాథ్ రెడ్డి, పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామిరెడ్డి చేసిన తప్పిదాలకు కిందిస్థాయి ఉద్యోగులు బలయ్యారని దేవినేని ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు.

# పిడుగుపాటుకు గేదె మృతి

**వికారాబాద్,మే 20(నమస్తే ఉదయం):**
కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం తిమ్మారెడ్డిపల్లి అనుసంధాన గ్రామమైన బంగ్లా తాండ కు చెందిన లక్ష్మీనాయక్ తండ్రి తిమ్మనాయక్ అనే రైతు గేదె సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉరుము మెరుపులతోపాటు వర్షం రావడంతో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. ఈ సందర్భంగా రైతు బోరున విలపిస్తూ లక్ష రూపాయలు అప్పుచేసి తెచ్చుకున్నానని ఇప్పుడు ఆపు ఎలా తీర్చాలో తోచడం లేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. పరిస్థితిలో ఉన్న మాకు పిడుగుపాటుకు ఎలా బతకాలో అర్థం కాని స్థితిలో ఉన్నామని బోరున విలపించాడు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist,
Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.